# వంటింటి లెక్చర్లు (4)
# జంతికలు

మొన్న జంతికలు చేస్తూ కూచున్నా. మా పిల్ల వెధవలొచ్చి చేరారు చుట్టూ. నూనె సలసలా మరిగివుందేమో ముక్క వేసే సరికల్లా మనవాళ్ళ దేశభక్తిలా అదేపనిగా పొంగటం ప్రారంభించింది.

అమ్మా ఇండియా వెయ్యవే- అని కూచున్నాడు మా చిన్న సన్నాసి అంటే ఇండియాలా జంతిక వెయ్యమని తాత్పర్యం. ఇండియా వేశాక పాకిస్తాన్ వేయమంటావ్ ఆ తర్వాత బంగ్లాదేశ్, బర్మా, సిలన్ అన్నీ వేయమంటావ్ నాచేతకాదు పొమ్మన్నాను. చేసిన జంతికల్ని వేస్తున్న డబ్బా దగ్గర కూర్చుని అందులో వేసిన జంతికల్లా తీసి వాటిని సరిచేసి బంగ్లాదేశ్‌లా వచ్చిందేవ్ పాకిస్తాన్‌లా వచ్చిందేవ్ అని గొడవ చేస్తున్నారు. వినిపించుగోకుండా. "వీళ్ళని చూడండి" అని హైకమాండ్‌కు ఓ కేక వేశాను. "సర్లే అరవకు" అని మళ్ళీ కేకవేశారు. చాలా మంది ఇంట్లో భార్యా భర్తలు అనురాగ యుక్తంగా సరాగాలాడుకుంటూ వుంటారని కథలూ గట్రా చదివీ సినిమాల్జూసీ అనుకుంటారు. కాని అదంతా శుద్ధ తప్పు. మా యింట్లో ఒకరిమాట ఒకరికి తెలవాలంటే "అల్లాహో అక్బర్" అని మసీదులో దేవుడికి వినపడాలని అరిచినట్లు అరవాల్సిందే

లేకపోతే హారాహుంషార్ అని రాత్రిపూట గూర్ఖావాడు తలుపుమీద లాఠీతో కొట్టి అరుస్తాడే అట్లా అరవాలి అంచేత కలకూజితాలూ కిలకిలారావాలు మా బోటివాళ్ళ ఇళ్ళలో వినపడవ్- రాదారి బోట్లో ప్రయాణంలాగా పొద్దల్లా ఒకరిమాటొకరికి వినపడదు, ఎవరిగొడవ వారిది.

జంతికల గురించి మాటాడుకుంటున్నాంగదా- అవి నేనో మూల చేస్తూంటె. మా వాళ్ళు వాటిని చిదిపేసి మ్యాపులు చేస్తున్నారు. కుడి చేతితో జంతికల గొట్టం అలా పట్టుకుని ఎడం చేత్తో దేవుతున్నా. ఇంతలో పరిగెట్టుకొచ్చి చిన్నపిల్ల నీప్మీద పడింది. నేను ముందుకు పడపోబోయాను నూనె చింది నా చేతులమీద చీరమీదా పడింది. నా అదృష్టం. బావుండి మొగం మీద పళ్ళేదు.

అదల్లా ఒదిలేసి వాళ్ళవెంట పరుగెత్తాను పట్టుకుందామని వాళ్ళు దొడ్లోకి పరిగెత్తి పెంటకుప్ప మీదెక్కి నిలబడ్డారు. పెంటకుప్ప మీదెక్కి నిలబడితే నేను అక్కడకు రాలేనని వాళ్ళకు తెలుసు.

"ఇదిగో ఇట్రండి" అని బిగ్గరగా అరిచాను.

"ఏవిటే ఆ వెధవ గోల. వెధవ అరుపులూ నువ్వూనూ" అంటూ కళ్ళజోడు సర్దుకుంటూ చదువుతున్న పుస్తకం మధ్య వేలుదూర్చి వచ్చారు విసుగ్గా, చిరాగ్గా, అయోమయంగా.

"వీళ్ళు చూడండి, నా ప్రాణాలు పీకి పిండెడుతున్నారు" •అని పెంటకుప్ప కేసి చూపించాను.

"అక్కడేం చేస్తున్నార్రా? దిగండి, దిగండి, ఛీ! ఛీ! ఛీ!" అని ఆయన "యాక్ట్" చేశారు.

"అమ్మ కొడుతుంది" అన్నారు. వాళ్ళు బితుకు బితుగ్గా చూస్తుంటే.

"కొట్టదులెండి. దిగిరండి—" అన్నారాయన.

"ఎందుకు కొట్టను. వీపులు చీరేస్తాను" అని ప్రతిజ్ఞ చేశాను.

"వాళ్ళనలా భయపెట్టబట్టే ఇంట్లోంచి పారిపోయి పెంటకుప్ప లెక్కుతున్నారు. రండ్రా రండి అన్నారు వాళ్ళ పక్షం మాట్లాడుతూ.

"చూడండి ఏం చేశారో— అదొచ్చి నా వీప్మీద పడింది. నేను ముందుకు తూలి సలసల కాగుతున్న చమురులో పడిపోయేదాన్ని. ఎంత గండం తప్పింది?" అన్నాను సానుభూతి నపేక్షిస్తూ.

"గండం దేనికి? చమురెందుకు కాచావు?" అన్నారు ఓనమాం దగ్గరకొస్తూ.

"జంతికలు చేద్దామని పిండి తడిపి పెట్టాను."

"జంతికలు ఎవరు చేయమన్నారు?"



"ఎవరూ చేయమనలేదు. నాకే చేద్దామని పించింది. ఆదివారం కదా ఇంట్లో వున్నారు కదా-"

"నే నింట్లో వుంటే జంతికలు తింటానని నీతో చెప్పానా?"

"చెప్పాలిటండీ- చెప్తారా ఎక్కడన్నా - చేస్తే తింటారు కదా అనీ"

"మీ లేడీసక్కి అవసరమైన ఊహాశక్తి ఎక్కువ. అందుకే కష్టాల్లో పడతారు. ఎందుకే జంతికలు? హాయిగా రెస్టు తీసుకోక. పైగా అదేం

టిఫిన్ కాదు. నవలాలి. ఒక్కో జంతికకు పావుగంట పట్టినా పడ్తుంది తినడానికి. తినేవాళ్ళసైము ఎంత వేస్టవుతుంది" అని ప్రారంభించారు.

నా మనసు చివుక్కుమంది. చెప్పొద్దూ-పిల్లలూ ఆయన తింటారని భోంచేయగానే నడుం వాల్చుకోలేకనా పొయ్యి ముందు తగలడింది-సానుభూతి, అయ్యో ఆడది కష్టపడుతోందన్న యిదన్నా లేకుండా నానా మాటలూ అంటున్నారు. అనండనండని యిక అక్కడ నిల్చోకుండా విసురుగా లోపలికి కొచ్చి "స్టవ్వ్" ఆర్పేసి బాణలినిదించేసి ఆ జంతిక లెక్కలిపిన సెనగపిండిని అలా వదిలేకుండా మరో మూతబోర్లించి జంతికల డబ్బానలా వదిలేసి చెంగు పరుచుకుని, పడుకుని కళ్ళ నీళ్ళెట్టుకోసాగాను.

ఏం జన్మ? ఆడజన్మ? ఏం జన్మ వెధవ జన్మ? జంతికలు చేసుకోవటానిక్కూడా వంకలే-దెప్పుళ్ళే-పోనీ తనొక్కర్తే తింటుందా? అందరూ తింటారే మరి ఆ మాటలేవిటి? అయ్యో ప్రాణప్రియా జంతిక లొండుతున్నావా అని కాళ్ళ మీదపడిపోమని అడగలేదే-వంక పెట్టకుండా చేసింది తినమన్నాను, ఒక చల్లని మాట. ఒక మంచి ముక్క నోటంట వస్తుందేమో చూస్తాను, రాదు. ఎందుకు వస్తుందీ! అస్సలాహృదయంలో జంతికలకే చోటులేదు. నాకెక్కడుంటుందీ అని యీ విధంగా వాపోతూండగా వారూ. పిల్లలూ వచ్చారు వంటింట్లోకి—

జంతికల డబ్బా తీసుకుని. తనకు భార్యనేగాక పిల్లలకు కన్నతల్లినై పిల్లలకేగాక చేసిన జంతికలకు కూడామాతృమూర్తినైన నన్ను సంప్రదించ కుండా ఆ డబ్బా పట్టుకుపోయి టేబుల్మీదెట్టుగుని ముగ్గురూ తింటున్నారు. నన్ను పెట్టమని అడగలేదు. యిదెవత్తి కోన్కిస్కా అన్నట్లు నన్నొదిలేసి నా జంతికల్ని కబళిస్తున్న ధ్వనులు నాకు వినపడుతున్నాయి.

అందులో కొన్ని వీరచక్రాలుట. కొన్ని పరమవీర చక్రాలుట, కొన్ని అశోకచక్రాలుట యిలా సాగిపోతున్నది తండ్రీ బిడ్డల సంభాషవ జంతికలయి పోయినట్లున్నాయి. నవలటం ఆగిపోయింది. డబ్బా పట్టుకొచ్చి నా ఎదురుగుండా పెట్టి-"అమ్మ నిద్దరపోతోందర్రా వెధవల్లారా, గొడణ

చేయకండి. పాపంక్షేస్తుంది" అన్నారు అలాఅన్నాక కళ్ళు తెరిచిచూడటం లేవటం మంచిది కాదని పడుకునే వున్నాను.

"అమ్మ ఎప్పుడూ జంతికలే చేస్తుంది? ఎందుకు నాన్నా?? అని అడిగింది మా అమ్మాయి.

"అమ్మకు జంతికలేవొచ్చు. ఇంకో అప్పచ్చి చెయ్యటం రాదు" అని మా అబ్బాయి జవాబు చెబుతున్నాడు. మా వారందుకున్నారు—

"మీ అమ్మకు దేశభక్తి హెచ్చు. వాళ్ళపేరు చెప్పి పరమవీర చక్రాలూ అవీ యివ్వాలని చేసింది" అంటున్నారాయన.

జంతికలు నేరకపోయి తలపెట్టుకున్నాను. ఇంకెప్పుడూ యీసజ్జుతో యిటువంటివి తల పెట్టకూడదనిపించింది. కాని కళ్ళు తెరవనా మాననా అనే డైలమాలో కాలికేదో తగిలింది—జంతికల డబ్బా అనుకుని కాలు విదిపాను. "అమ్మ తంతుదిలే నాన్నా" అంటున్నాడు పిల్లలు. "జలజాతాసన వాసవాది...."

★